# ఎన్నోరంగుల తెల్లకిరణం
## - సిరివెన్నెల సీతారామశాస్త్రి



*(సిరివెన్నెలగారు వ్రాసిన కథలు నెలకొకటి)*

***సంకల్పం***

సాహిత్యంలో `కథ` (short story)కి సంబంధించిన నిర్వచనాలూ, నియమావళి, ఆవిర్భావం. ఆకృతి, పరిణామము, పరిణితి ఇత్యాది అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అవగాహన ఉంది - అని నేను అనుకోను. కథా సామ్రాజ్య నిర్మాతల, నిర్ణేతల సరసన నిలచి తర్కించే తాహతు నాకుందని కూడా అనుకోలేను.

`ఏం చెప్పాలి` అనే దానికన్నా `ఎలా చెప్పాలి?` అనే అంశంపట్లే నాకు ఎక్కువ మక్కువ.

కనుక, నా కథల్లో ఇంతవరకు స్పృశించబడని, కనని, వినని అపురూపమైన `వస్తువు` ఉందని దబాయించను.

కథా కథన విధానంలో, రసపోషణ, నిర్వహణ వగైరా సాంకేతికాంశాలపట్ల నాకున్న పరిజ్ఞానం బహు తక్కువ.

`కథ చెప్పడం` అనేది ఎప్పుడో అయిపోయింది - “with all its totality & perfection” అనేది నా నమ్మకం.

`ఎలా చెప్పడం` అనేది ఎప్పటికీ అయిపోదు అనేది కూడా నా నమ్మకం.

`అతి పాత`, `మామూలు` విషయాలే ఒక్కొక్కప్పుడు నా గుండెను కొత్తగా, బలంగా `తాకిన` అనుభూతి కలిగినప్పుడు, ఆ అనుభూతిని యథాతథంగా `మాటల్లో`కి అనువదించడానికి నేను చేసిన ప్రయత్నాన్ని చాలామంది కథా సాంకేతిక నిపుణులు `ఇది, ఇలాంటిది కథే కాదు పొమ్మన్నారు.`

`కాబోసు` అనుకున్నాను గాని, తెగబడి `ఏం? ఎందుక్కాదు?` అని ఎదురు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు. `కానీలే! నాదో `మాలోకం` అయి ఉంటుందని ఊరుకున్నాను.

నా `మాలోకం`లో జనాభా లెక్కల సేకరణ జరిగితే, నేను గాక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఉంటారా అని తెలుసుకోవాలనే నా ఆరాటం గత ముప్పై సంవత్సరాలుగా నన్ను వెన్నంటే ఉంది.

ఆ `రీసెర్చి`లో భాగంగా ఇలా నా `స్వగతాలన్నీ` ఓ సంకలనంగా పోగుచేసి అన్వేషణకి పంపిస్తున్నాను.

*(సీతారామశాస్త్రి)*

***

*మరో సింద్‌బాద్ కథ*

**నాకూ** సింద్‌బాద్‌కి కొన్ని పోలికలున్నాయి. తను తిన్న చావుదెబ్బలన్నిటినీ, చివర్న తీరిగ్గా కూర్చుని `కథలు`గా చెప్పుకున్నాడు సింద్‌బాద్.

నేను తిన్న చావుదెబ్బని మీకు 'కథ'గా చెప్పుకుని నన్ను నేను ఓదార్చుకుంటున్నాను.

అన్ని డింకీలూ కొట్టి, వాడు దురదృష్టం చేతుల్లోంచి జారిపోయి తప్పించుకున్నాడు.

ఇన్ని మెలికలూ తిరిగి, నా అదృష్టం, నా వేళ్ళ మధ్యనుంచి జారిపోయి తప్పించుకుపోయింది.

సింద్‌బాద్ జీవితాన్ని 'కథ' అని కాకుండా, నిజం అని నమ్మలేం. అలా నమ్మవలసి వస్తే, ఆ 'నిజం'లో థ్రిల్‌కన్నా టెన్షన్ ఎక్కువైపోతుంది. 'రిలీఫ్'కన్నా 'విరక్తి' ఎక్కువ కలుగుతుంది.

నా యీ కథని నాకు నేనే 'కథ' అనుకుంటూ ఉంటాను 'ఇదీ కథేలే' అని అనుకోకపోతే, 'అమ్మో! ఇది నిజం!' అని అనుకుంటేనే నేనే భరించలేను.

జరిగిన నష్టాన్ని, జారిపోయిన అదృష్టాన్ని తలుచుకుని, ఆ నిజాన్ని గురించి ఆలోచిస్తే గుండె బేజారెత్తిపోతుంది నాకు. అదంతా 'ఒక చిన్న తమాషా కల' అని నన్ను నేను నమ్మించుకుంటూ, ఆ 'తమాషా'ని ఇలా ప్రతికాముఖంగా మీకూ చూపిస్తే, ఓ డెబ్బై అయిదు రూపాయల పారితోషికమైనా దక్కుతుంది కంటితుడుపుగా.

నాకు లాటరీ టిక్కెట్లు కొనే అలవాటుంది. ఆ అలవాటు వెనక బలహీనమైన నమ్మకం ఒకటి, బలమైన థీరీ ఒకటి, మొత్తం రెండు "ఫ్లాష్‌బాక్"లున్నాయి.

నువ్వు నాలుగు రూపాయలు తగలేసి సినిమాకి వెళతావు, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం అవునా! ఆ నాలుగు రూపాయలతో ఎంతసేపు కాలక్షేపం చెయ్యగలవు? మహా అయితే మూడుగంటలు. అంతేగా? నీ అదృష్టం సరిగా లేకపోతే ఆ మూడుగంటలూ నీకు మంచి కాలక్షేపం బదులు ఒక ఘోర శాపంలాగా పరిణమించవచ్చు.

నా సంగతి అలాగ కాదే రూపాయే ఖర్చు పెడతాను. డ్రా తేదీదాకా, ప్రతీరోజూ, ప్రతీక్షణం, ఎన్నెన్నో టెక్నికలర్ 'కలల ఫిలింస్' చూస్తాను. చీప్ అండ్ డ్యూరబుల్ ఎంటర్‌టైన్‌మెంట్. బోర్ కొట్టదని హామీ ఉంది - కథ, స్క్రీన్‌ప్లే, ఎట్సెట్రా అన్నీ నావే గనక. ఎలా ఉంది? ఇలా మా ఆవిడకి నచ్చచెబుతూ ఈ థీరీని తయారు చేశానన్నమాట. (నిజంకూడా అదేలెండి)

సినిమా చూడటం అయిపోయాక, హృదయంలో అనుభూతిని మిగుల్చుకుని, జేబులోని టికెట్ ముక్కని చింపి అవతల పారేస్తాం గదా! అలాగే, ఫలితాలు అయిపోయాక, అప్పటిదాకా కన్న కలలన్నిటినీ భద్రంగా గుండెలో దాచుకుని టిక్కెట్‌ని చింపి అవతల పారెయ్యడం నా అలవాటు.

అసలేమీ బాధపడను. దాని గురించి మరి ఆలోచించను. లక్షల లక్షల అంకెల మధ్య. 'రాకపోతుందా' అనే అసాధ్యమైన ఆశకన్నా 'రాదు!' అనే అందుబాట్లో ఉన్న నమ్మకం ఎక్కువ నాకు. అయితే సినిమా చూస్తూ ఉండగా, తెరమీద గుట్టం తన్నిన తోపుకి, థియేటర్లో నా పళ్ళూడి కింద పడిపోవడం ఎంత ఫెంటాస్టిక్‌గా ఉంటుందో, అలాగ...

పేపర్లోని ఫలితాల్నీ, చేతిలోని లాటరీ టిక్కెట్ నమ్బర్నీ పరిశీలిస్తూపోతున్న నా కళ్ళ ఓ చోట ఠక్కున ఆగిపోయాయి.

'ఏమిటీ?...ఏమిటీ?... మళ్ళీచూడు, మళ్ళీ చూడూ!..V…VI…2…2….3….3…2…2..1…1…4…4…8 అమ్మా! .. గొప్ప దెబ్బ తినిపించేవు గురూ.

పేపర్లో నెంబరు V 232148. నా చేతిలో ఉన్న టిక్కెట్ నెంబరు V 232145 ఏభైవేల రూపాయల సెకెండ్ ప్రైజ్ ఆ నెంబర్.

అదృష్టం తన్నిన 'గుడ్డిగుట్టం తాపు'కి నాకు కళ్ళంట నీళ్ళు జలజలా రాలాయి. 'భాగ్యలక్ష్మి' తాలుకు ఏభైవేల 'గలగలలు' నాకు సరిగ్గా మూడడుగుల దూరంలో రాలాయి.

ఎన్నాళ్ళబట్టో కొంటున్నాను. ఎన్నిసార్లో కొన్నాను. అన్ని స్టేట్లూ, అన్ని సిరీస్ కొంటూ ఉంటాను. నా నెంబర్ ఎప్పుడూ దరిదాపుల్లోకి కూడా వెళ్ళలేదు సరికదా. ఒక అంకె కూడా ఎప్పుడూ కలిసిన పాపాన పోలేదు, ‘అయిదంటే అయిదు రూపాయల ప్రైజు వచ్చినా చాలు, నా పెట్టుబడి గిట్టుబాటైపోతుంది,‘ అని ఎన్నోసార్లనుకున్నాను. ప్చ్.. అంతెందుకు?

ఈ టిక్కెట్టు కొన్నానా? అయిదు సిరీస్ ఉన్నాయి. అన్నీ కొన్నాను. అయిదు రూపాయలు పెట్టి కొన్నాను. ఆ అయిదూ బదులు, ఈ వి సిరీస్‌లోనే మరో మూడంటే మూడు టిక్కెట్లు కొని ఉంటేనా..? అప్పుడు ఒక రూపాయీ మిగిలి ఉండేది. ఇప్పుడు, ఇవాళ, యిలా ఈ కథ రాయవలసిన పని ఉండేదికాదు. (చిన్న నవ్వు వచ్చిందిప్పుడు)

చిన్న నవ్వు నవ్వుకున్నానప్పుడు. మామూలుగా, నా అలవాటు ప్రకారం, టిక్కెట్టు చించి అవతల పారేసాను. చాలాసార్లు చేసాను అలాగ. ఇది వరకూ, ఇప్పుడూ, పెద్దతేడా ఏంలేదు గాని, కొంచెం గుండెల్లో ‘మంట‘గా ఉన్నట్లనిపించింది.

ఓ అరగంట తర్వాత మళ్ళీ మామూలుగా నా పనుల్లో నేను పడిపోయాను.

సూర్యనారాయణ ఇంటికి బయలుదేరాను. అతన్ని ఓ యాభై రూపాయలు అప్పడిగాను. ఇస్తానన్నాడు. తీసుకోవడానికి వెళుతున్నాను. ఏవేవో ఆలోచనలు.

‘ఈ యాభైతో ఈ నెల ఫస్ట్ తారీఖు చూసేస్తే బాగుండును. కానీ, మళ్ళీ పదో పాతికో తెమ్మనేలాగే ఉంది ధర్మపత్ని.‘

సడన్‌గా నా సైకిల్‌కి బ్రేక్ పడింది. చటుక్కున దిగి అందుకున్నాను. చిన్నగుడ్డ సంచీ అది. సాధారణంగా రిక్షావాళ్ళ దగ్గరా, కూరలవాళ్ళ రొంటినా ఉంటుంది. డబ్బు సంచీ అది. బాగా మురికిగా ఉంది.

తీసి చూసాను. పాతకాలంనాటి చిల్లికానీలు రెండు, రాగిపైసలు మూడు, చిన్నచిన్నగవ్వలూ.. రూపాయో రెండురూపాయలో ఉంటుంది చిల్లర. తరవాత? తరవాత.

ఇంకా సస్పెన్సేమిటీ నా మొహం? మీరీపాటికి ఈజీగా ఊహించేసి ఉంటారు. మీ ఊహరైటే. నిజమేనండీ. అదే లాటరీ టిక్కెట్టే. అవును బాబోయ్, భాగ్యలక్ష్మే. సింప్లీ యూ ఆర్ డేమ్ కరెక్ట్. అదే నెంబర్. వి. 232148.

ఒక్క క్షణంపాటు గుండె ఆగి, దడదడలాడుతూ పరుగు తియ్యడం మొదలు పెట్టింది. ఓ పదినిమిషాలపాటు ఆ టెన్షన్ అలాగే ఉంది. స్పీడ్‌గా కొట్టుకుంటున్న గుండె, ఆగిపోకుండా మళ్ళీ మామూలుగా మారిపోయింది.

ఆశ ఏ మాత్రం తక్కువగా ఉన్నా, ఆ యాభైవేల ఎమౌంట్‌కి గుండె ఆగిపోయేదే కాని, నేను కొంచెం, ‘ఆశాపాతకుణ్ణి‘ నా గుండెని ఆపెయ్యడానికీ, నా కలల్ని కొనెయ్యడానికి ఇది చాలా చిన్న ఎమౌంట్.

మరో పదినిమిషాలపాటు అక్కడే నిలబడిపోయినతర్వాత, నా బుర్ర స్థిమితపడి, పనిజెయ్యడం మొదలు పెట్టింది. నా మనస్సులో అరగంటపాటు తీరిగ్గా తర్జన భర్జన జరిగిన తర్వాత.

"ఈ టిక్కెట్టు కొన్నవాడెవడో పాపం బీదవాడై ఉండాలి. బీదవాడైనా కాకపోయినా, ఎవడి టిక్కెట్‌లోనో నేనెలా స్వంతం చేసేసుకుంటానూ? ఈ టిక్కెట్‌ని ఎవరమ్మేరో నాకు తెలుసు. అక్కడేగా నేను కొన్నానూ? ఆ సెల్లర్‌కి, టిక్కెట్ అమ్ముతూ, పేరూ ఎడ్రస్సూ అడగడం అలవాటు. నేనంటే అడ్రస్ ఇవ్వలేదు గాని, (నా అనుమానాలు, సెంటిమెంట్లూ జాగ్రత్తలు నాకున్నాయి మరి. ఎంతైనా ఎడ్యుకేటెడ్‌ని కదా మరి) ఈ టిక్కెట్ కొన్నవాడు పేరూ, ఎడ్రస్సూ ఇచ్చే ఉంటాడు. అక్కడ ఇన్ఫర్మేషన్ తెలియవచ్చు. ఈ టిక్కెట్‌ని ఎవరు కొన్నారో జాగ్రత్తగా ఆరాతీసి, అసలు స్వంతదారుడికి వాడి సొత్తుని చేర్చడం మంచిది.

పుణ్యం, పురుషార్థం రెండూ దక్కుతాయి. ఈ విధంగా అనుకుని బయలుదేరాను.

***ఉపకథ లేక రామాయణంలో పిడకలవేట***

ఇక్కడదాకా చదివినతర్వాత, మీలో కొందరు ఇతను గురించి, "వీడెవడో చాలా మంచి వెధవలా ఉన్నాడే ఏభైవేలు చేతికి చిక్కితే కూడా, శ్రీరాముడి ఫక్కీలో ధర్మవర్తనం సాగిస్తున్నాడు. పోన్లే, మంచి ముండావాడు. ఇలాంటి వాళ్ళింకా భూమ్మీద ఒకరో ఇద్దరో ఉండబట్టే, భూమ్మీదింకా కిరసనాయిలు అక్కడక్కడా కనబడుతోంది" అని అనుకుంటున్నారు కదూ?

"భలేగా చెవుల్లో పువ్వులు పెట్టేస్తున్నాడోయ్ మనకి. పోనీ పాపం అని కథ వింటున్నాం (చదువుతున్నాం)గదా అంటే, వీడు ఏకంగా 'పౌరాణిక నాటకం' కట్టేస్తున్నాడు. అరిచ్చెంద్రుడి బాబు ఈడేనేమో" అని కూడా అనుకుంటున్నారు మరికొందరు అవునా?

ఆ మరికొందరి అభిప్రాయం కన్నా, ముందరి కొందరి అభిప్రాయమే మోర్ కరెక్ట్ అని నా మనవి ఎంచేతంటే.

నేను మంచివాణ్ణనేది నిజం. కాగా, అంతకన్నా ఎక్కువగా, అంతరాత్మకిలొంగి బతికే మధ్యతరగతి వాణ్ణనేది మరో నిజం. మోర్ నిజం. అదే అసల్నిజం. అంతరాత్మ అంగీకరించకుండా ఫూల్ ప్రూఫ్‌గా లేని నేరాన్ని చూస్తూ బొత్తిగా వీక్ పాయింట్స్ ఉన్న వెధవ పనిని చెయ్యలేం గదండీ మఈ?

ఈ సెల్లర్ గాడిద, ఆ బయ్యర్ (కొన్నవాడు) గాడిద పేరూ, ఎడ్రస్సూ నమోదుజేసుకున్నాడనుకోండి. నేను కంగారుపడి అత్యాశకి పోయి, టిక్కెట్ నాదే అనిచెప్పి క్లెయించేసేశాననుకోండి. అయ్యా? ఆ పైనెక్కడో తీగా డొంకా కదిలేయనుకోండి. నన్ను దొంగతనం నేరం మీద మూసెయ్యరుగాని, 'నాకు దొరికింది అని నేను నిజాన్ని దబాయించేవచ్చుగానీ అర్జంటుగా లోకమంతా నీతి బెత్తం చేతబట్టి, నన్నో వెధవగా జమగట్టి, పాఠాలు చెప్పేసి, అసలు వాడికి డబ్బులిచ్చేసి. 'నువ్వింక యింటికెళ్ళిపోయి, బుద్ధిగా, నీతిగా బతుకు' అని నన్ను తోలేస్తారుగదా? (ఏవంటారు..? రొష్టుపడనేల..? ఏఁవండీ..? ఆఁ..?)

నేనే ప్రయత్నమూ చెయ్యనక్కరలేకుండానే, నాకు కావలసిన, నాకు యిష్టమైన నాకు అనుకూలంగా ఉన్న ఇన్ఫర్మేషన్ దొరికింది.

నేను వెళ్ళే సరికి చుట్టూ మూగి ఉన్న జనాల్తో నవరసాభినయం జేస్తూ చెబుతున్నాడా సెల్లర్.

"..అందుకేనండీ బాబూ! పేరు రాయించుకోమని బతిమాల్తాం. ఎడ్రస్ ఇచ్చెళ్ళండి, మేమే తెలియబరుస్తాంగదా! అని మొత్తుకుంటాం. అయినా కొందరు వినరు. వాళ్ళు ఏమనుకుంటారో, వాళ్ళకి ఏమనుమానాలుంటాయో తెలీదు. ఇదిగో యిలాగవుతుంది. జాగ్రత్తగా చూసుకుంటే సరే, లేకపోతే అనవసరంగా గవర్నమెంట్‌కి జమ అయిపోతుంది గదా! ఎవళ్ళు తిన్నట్టు?

ఇంకా కొనసాగిన అతని ఉపన్యాసాన్ని బట్టి, గోడంతా ఈ ఏభైవేల రూపాయిల టిక్కెట్టు గురించేననీ, భాగ్యలక్ష్మి వరించిన ఆ పెళ్ళికొడుకు యొక్క వేరెబౌట్స్ ఈ 'పేరయ్య'గారికి తెలీవనీ, స్పష్టంగా నిర్ధారణ అయిపోయింది నాకు. తక్షణం గుండె దడదడ ఎక్కువైంది నాకు. బి.పి పెరిగింది నాకు. చెమట్లు పట్టాయి నాకు. ఒంట్లో ఆనందపు వణుకు మొదలయ్యింది నాకు.

అంటే..? అంటే...! నిస్సంశయంగా, మరే శషభిషలూ, కుశంకలూ పెట్టుకోకుండా, ఈ భాగ్యలక్ష్మి వేసే వరమాల కోసం నా మెడ చాచవచ్చునన్నమాట.

నిజం చెప్పొద్దూ, గొప్ప జాలేసింది ఆ నిర్భాగ్యుడి మీద. ఆ సంచీ గుర్తొచ్చింది. 'పెద్దమ్మ'కి నిలయమైన ఆ పేద ఇంట ఈ 'చిన్నమ్మ' నిలవనందన్నమాట. పాపం.

(ఇది ఫూల్ ప్రూఫ్‌గా ఉన్న నేరం. మరియు వీక్ పాయింట్స్ లేని వెధవ పని గనకం చేసి) నా అంతరాత్మ కూడా (మొదట ఆ అజ్ఞాత దురదృష్టజాతకుడి మీద చాలా జాలిపడి వాడి గురించి ఎంతో బాధపడి, వాడిని యింకా అలాగే అంటిపెట్టుకుని ఉన్న దరిద్రాన్ని తలుచుకుని తలుచుకుని దుఃఖించి అంతా అయ్యాక చివర్న దీర్ఘంగా నిట్టూర్చి ఆ వెనక మొహం తుడుచుకుని ఫ్రెష్‌గా తయారై, పిదప చిన్న చిరునవ్వు నవ్వుతూ) 'మరి కానీ కేరీ ఆన్ లక్కీఫెలో' అని గ్రీన్ సిగ్నల్ యిచ్చేసింది.

గాలిలో హుషారుగా తేలుతూ యింటికి వచ్చాను. 'రేపు ఉదయాన్నే బ్యాంక్‌లో డిపాజిట్ చెయ్యాలి. ' అని మొదలైన నా ఆలోచనలు ఎలా పరిగెత్తి ఉంటాయో మీకు తెలుసు. ఆ రాత్రి నేను నిద్రపోయి ఉండననీ మీకు తెలుసు.

ఆ రాత్రి నేను టెక్నికలర్‌లో లక్షలు లక్షలు ఖరీదు చేసే భారీ చిత్రాల కలల్నిగాక ఏభైవేల రూపాయల బ్లాక్ అండ్ వైట్‌లో బడ్జెట్ చిత్రకథల్నే కలగన్నాను.

అప్పటిదాకా మేఘాల మీద కలల భవంతులు కట్టాను.

ఆ రోజు చిన్న పేపర్ మీద అతి చిన్న యింటికి ప్లాన్ గీసుకున్నాను.

ఉదయం తొమ్మిదిన్నరౌతోంది. భోజనం చేసేసి ఆఫీస్‌కి సిద్ధమౌతున్నాను. ఆఫీస్‌కి వెళుతూ బ్యాంక్‌కి వెళ్ళాలి.

పేపరు వచ్చింది. అనాసక్తంగా గబగబా పైపైనే తిరగేస్తూ చూస్తున్నాను సడన్‌గా నా కళ్ళు ఒకచోట ఆగిపోయాయి.

"సవరణ: - నిన్న భాగ్యలక్ష్మి లాటరీ ఫలితాలు ప్రచురించటంలో చిన్న పొరబాటు దొర్లింది.

కాకినాడలో అమ్మబడిన ద్వితీయ బహుమానం రు.50,000లు పొందిన టిక్కెట్టు నంబరు వి.232148కి బదులు వి.232145 అని సవరించుకుని గుర్తించ ప్రార్థన.

ఈ పొరబాటుకి ఎంతో చింతిస్తున్నాం"

వి.232145..!!?? మొద్దుబారి పోయిన బుర్రతో డెస్పరేట్‌గా నా డెస్క్ క్రిందికి చూసాను.

పనిమనిషి ఉదయాన్నే ఊడ్చేసి ఉంటుంది - ఏభైవేల రూపాయల ముక్కల్ని.

Post your comments